# దొంగ వాళ్ళో

రాజారావు అటునుంచి వస్తుంటే దారిలో నాగభూషణం ఇంటిముందు జనం గుంపుగా కన్పించారు. మధ్యలో వున్న నాగభూషణం పెద్ద పెద్ద కేకలు వేస్తున్నాడు.

అతను గుంపులోకి జొరబడి చూసే సరికి నాగభూషణం ముందు ఒక పదేళ్ళ కుఱ్ఱవాడు మాటా పలుకూ లేకుండా కళ్ళు ఒప్పగించి దిక్కు-ముఖం వేసుకుని నిల్చున్నాడు. శివమెత్తినవాడిలా ఎగురుతూ అరుస్తున్నాడు, నాగభూషణం.

విషయం ఏమిటో ఎవర్నీ అడక్కు-ండానే అర్థమైపోయింది రాజారావుకి.

నాగభూషణం ఇంటిముందు ఒక నారింజచెట్టువుంది. దాని కాయ ఒకటి ఆ కుఱ్ఱాడు దొంగతనంగా కోశాడు. అదీ సంగతి. దానికే ఆయనగారు పెద్ద పంచాయితీ పెట్టి రాద్ధాంతం చేస్తున్నాడు.

ఆ చెట్టుకు వందలకొద్దీ కాయలు విరగ్గాసి చూసేవారి నోళ్ళూరిస్తున్నాయి. ఆ రోడ్డుమీద వచ్చేపోయే ప్రతివారూ ఆ చెట్టువైపొకసారి చూసిగానీ వెళ్ళలేరు. అంతగా ఆకర్షిస్తుందా చెట్టు. అయినా ఏదో కుఱ్ఱవాడు. చిన్నతనం. ఒక కాయ కోస్తే కోసి వుండవచ్చు. దానికేనా ఏదో కొంపమునిగి పోయినట్లు గోలపెడుతున్నాడు. పరమ లోభిరా నాయనా ! అనుకున్నాడు రాజారావు,

ఆ కుఱ్ఱవాడి చేతిలో కాయ తీసేసుకున్నాడుగా ఇంకా ఎందుకు రచ్చ. రెండు దెబ్బలుగూడా వేసినట్లున్నాడు. పాపం వాడి కన్నీళ్లు బుగ్గలమీద కారుతున్నాయి. నోట మాటలు రాక వెక్కి-ళ్ళు వస్తున్నాయి.

నాగభూషణంమీద కోపం, ఆ కుఱ్ఱవాడిమీద జాలి కలిగాయి రాజారావుకి. అతన్ని అమాంతం చెరుగ్గడ

నమిలినట్లు నమిలేయాలనిపించింది. కాని ఎలా ?

"ఏదో పుర్రవాడు లెండి. పోనియ్యండి. ఒక్క కాయేగదా కోశాడు" అన్నాడు రాజారావు, నాగభూషణంతో.

"మీరలాగే చెప్తారండీ, మీదేం పోయింది. ఈ రోజు ఒక్కకాయ కోశాడని వూరుకుంటే రేపు వందకాయలు కోస్తాడు," అని గంయ్! మంటూ రాజారావుమీదకు లేచాడు నాగభూషణం.

రాజారావు కోపంతో ముక్కుపుటా లెగరేశాడు. ఇంతమంది జనం వినోదం చూస్తూ నిల్చున్నారుతప్ప 'పోనీ పాపం' అని ఒక్కరూ అనరే. ఏం మనుషులో గాని అనుకున్నాడు.

"అయితే ఇప్పుడేం చేస్తారు ?" అన్నాడు రాజారావు రంగంలోకి దిగుతూ.

"ఏంచేస్తానా ? ఏద్రైనా చేస్తాను. కాళ్ళూ, చేతులూ విరగ్గొడతాను," అన్నాడు నాగభూషణం కోపంతో వూగిపోతూ. మధ్యలో వీడెవడో ఆ దొంగ వెధవకి సపోర్టు చెయ్యటం అని అతనికి మహా చిరాకుగా వుంది.

"విరగ్గొడితే చూస్తూ వూరుకోడానికి ఇది వూరండీ బాబు. అడివికాదు. ఏదీ విరగ్గొట్టండి చూద్దాం," అన్నాడు రాజారావు సవాలు చేస్తూ.

అసలు గొడవపోయి ఇదేదో సరికొత్త గొడవ మొదలవుతూ వుండడం చూసి "పోనీయండి. ఇక ఇంట్లోకి రండి మీరు," అంది నాగభూషణం భార్య.

రాజారావు సవాలు వినేసరికి నాగభూషణానికి కొంచెం జంకు కలిగింది. పైకి మాత్రం బింకంగానే వున్నాడు.

"పోనీ గదా అని వూరుకుంటున్నాను. అసలు పట్టుదల వస్తే పోలీసులకు అప్పజెప్పి వీడి భరతం పట్టిస్తా. అయినా మీకెందుకండీ ఈ గొడవ. సొమ్ము నాది. ఈ కాయ ఖరీదు ఎంతో తెలుసా? కనీసం నలభై పైసలు. ఈ ఎండల్లో కాయ దొరక్క అల్లాడిపోతున్నారు" అంటూ నాగభూషణం పిడికిలి విప్పి కాయ అరచేతిలో పెట్టుకుని ప్రదర్శించాడు.

తీరా పరీక్షగా చూస్తే అది నారింజకాయ కాదు. బత్తాయికాయ. రాజారావుకి జరిగినదంతా అర్థమైపోయింది. ఆ కుర్రవాడు బజార్లో బత్తాయికాయ కొనుక్కుని వస్తూ వుంటాడు. నాగభూషణం ఇంటి ముందుకు వచ్చేసరికి ఆ నారింజచెట్టు ఆకర్షణలో పడిపోయి అలా చూస్తూ నిల్చుండి వుంటాడు. ఇంతలో నాగభూషణం వచ్చి చూసి, ఆ కుర్రాడి చేతిలో బత్తాయిని నారింజ అనుకున్నాడు. ఇంకేముంది పట్టుకుని 'దొంగ, దొంగ' అని హడావుడి చేసేశాడు. అయితే ఆ విషయం ఎవరూ గమనించలేదు. కాయ నాగభూషణం



పిడికిట్లో వుండటంవల్ల సరిగా కన్పించ లేదు.

"మీ చెట్టువి ఏంకాయలు?"అన్నాడు రాజారావు.

"కళ్ళు కన్పించడంలేదూ ! నారింజ కాయలు," అన్నాడు నాగభూషణం వ్యంగ్య ధోరణిలో.

"అదే అడుగుతున్నాను. మీకు కళ్ళు వున్నాయా ? పోయాయా ? మీ చేతి లోది ఏంకాయ ?'' అన్నాడు రాజారావు తీవ్రంగా.

నాగభూషణం పరీక్షగా కాయని అటూ, ఇటూ తిప్పిచూశాడు. అది బత్తాయి కాయ అని గ్రహించగానే అతని ముఖం వెలవెల పోయింది. కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. గమ్ అంటించేసి నట్లు నోరు మూసుకున్నాడు.

"బత్తాయి ... బత్తాయి..." అని జనం కేకలు పెట్టారు.




"అన్యాయంగా కుర్రవాడిని కొట్టాడు గదరా," అని ఒకళ్ళిద్దరు సానుభూతి పలికారు.

"ష్...ఆగండి," అని రాజారావు విజృంభించాడు.

ఆ కుర్రవాడిని కొట్టినందుకు నాగిభూషణంపోలీస్ స్టేషన్‌కి రావాలన్నాడు. పోలీసుల మాట వినగానే అతను చలి జ్వరం వచ్చినవాడిలా గడగడ వణికి పోతూ రాజారావు కాళ్లూ, గడ్డాలు పట్టుకున్నాడు.

ఒక అరగంటసేపు నాగభూషణాన్ని కోతిని ఆడించినట్లు ఆడించాడు రాజారావు. గుంపులోవాళ్లు టిక్కెట్టు లేకుండా వినోదం చూశారు.

చివరికి కొట్టినందుకు నాగభూషణం చేత పదిరూపాయలు ఆ కుర్రవాడికి ఇప్పించాడు రాజారావు.

అందరూ రాజారావుని ప్రశంసిస్తూ వెళ్ళిపోయారు. అతను ఆ కుర్రవాడి భుజంమీద చెయ్యివేసి తీసుకెళ్ళాడు.

కొంతదూరం పోయాక ఒక కిళ్ళీకొట్టు దగ్గిర ఆపి పది కాగితం తీసుకుని చిల్లరమార్చి! ఒక రూపాయి ఆ కుర్రవాడి చేతిలో పెట్టి, మిగిలిన తొమ్మిది తన జేబులో పెట్టుకున్నాడు రాజారావు.

ఆ కుర్రవాడు తెల్లబోయి పెదవులు కదిలిస్తూ రాజారావు వంక చూశాడు. పాపం వాడికి మాటలు రావు.